# శ్రీ లలితా సహస్రనామ ప్రశ్నోత్తర మాలిక



## శ్రీ లలితా సహస్రనామ భాష్యం

వ్యాఖ్యానం: పూజ్యగురుదేవులు వాచస్పతి

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు

"శ్రీ గురుభ్యోనమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

www.gurujnanam.org



విషయ సూచిక

gurujnanam

| CD# | | పుట సంఖ్య |
|---|---|---|
| 1.1 | | |
| | ఉపోద్ఘాతం -1 | 1 |
| | ఉపోద్ఘాతం -2 | 3 |
| 1.2 | | |
| | ఫల శృతి | 5 |
| 1.3 | | |
| | శ్రీమాత్రే నమ: | 7 |
| | శ్రీ లలితా మాత ఆవిర్భావం | 9 |
| | అమ్మవారి రూప లావణ్యం | 11 |
| 1.4 | | |
| | అమ్మవారి ఆభరణ తత్త్వం | 13 |
| | మంగళ వదన ధ్యానం | 15 |
| | అమ్మవారి రూప లావణ్యం | 18 |
| 1.5 | | |
| | అమ్మవారి పాద కమల సేవ | 20 |
| | అమ్మవారి స్థాన, లీలా వర్ణన | 22 |
| 1.6 | | |
| | అమ్మవారి లీలా వైభవం | 24 |
| | భండాసుర వధ | 27 |
| | కుండలిని శక్తి | 29 |


gurujnanam

# ఉపోద్ఘాతం-1

1. లలితా సహస్రనామ స్తోత్ర విశిష్టత ఏమిటి?

జ. లలితా సహస్రనామ స్తోత్రం జగత్ప్రసిద్ధి చెందింది, ప్రత్యేకమైనది మరియు విశిష్టమైనది. అమ్మవారి మంత్రసిద్ధి సంపూర్ణంగా అందించటానికి ఋషులు అనుగ్రహించి ఇచ్చిన మంత్రరాశి ఈ లలితా సహస్రనామస్తోత్రం. ఉపనిషత్ తత్త్వం నిక్షిప్తమై ఉన్నది. ఇది మహావిద్య మరియు బ్రహ్మవిద్య.



2. లలితా సహస్రనామస్తోత్రంలోని మహామంత్రం ఏమిటి?

జ. ◆ "శ్రీమాత్రే నమః"◆

3. లలితా సహస్రనామస్తోత్రం ఎవరు ఎవరికి చెప్పారు?

జ. శ్రీ దక్షిణామూర్తిస్వామి శ్రీహయగ్రీవస్వామికి ముందుగా చెప్పారు. విష్ణువు అంశ అయిన శ్రీహయగ్రీవస్వామి అగస్త్య మహామునికి లలితా సహస్రనామ స్తోత్రం భోదించి, లలితాదేవి యొక్క విశిష్టతను తెలిపినట్లు బ్రహ్మాండపురాణములో చెప్పబడినది.

4. సహస్రం అంటే అర్థం ఏమిటి?

జ. సహస్రం అంటే అనంతవాచక శబ్దం. అనంత తత్త్వంకు సంకేతం. విశ్వం, సహస్రం, శతం, సర్వం ఇవన్నీ అక్షయతత్వాన్ని, అనంతతత్వాన్ని తెలియచేస్తాయి. అనంత భగవతత్త్వాన్ని అనుసంధానం చేసిన ఫలితం సహస్రం వలన లభిస్తుంది.

5. శ్రీవిద్యకి "సూత్రగ్రంథం" ఏది?

జ. లలితా సహస్రనామస్తోత్రం.

6. లలితా సహస్రనామస్తోత్రం పఠించటానికి అర్హతలు ఏమిటి?

జ. లలితా సహస్రనామస్తోత్రం పఠించటానికి అర్హతలు: 1) "సావధానము" అంటే ఏకాగ్రత, సంసిద్ధత 2) భక్తి - అమ్మపైన భక్తి ప్రధానము 3) శ్రద్ధ - శాస్త్రప్రమాణం మీద విశ్వాసము ఉండాలి.

7. లలితసహస్రనామ స్తోత్రం ఎవరికి చెప్పకూడదు?

జ. విశ్వాసం లేనివాడికి, మొండివాడికి, దుష్టుడికి చెప్పకూడదు.

8. అగస్త్యుని భార్య ఎవరు? వివరాలు తెలియచేయగలరు?

జ. అగస్త్యుని భార్య లోపాముద్ర. సాక్షాత్తు జగదంబ ఆవిడకు మంత్రం ఇచ్చారు. ఆవిడకు లలితమ్మపై భక్తి అనన్యం. లలితా సహస్రనామాలకు ఈ దంపతులు గురుస్వరూపులు. అంతేకాక సహస్రనామాల్లో పేరు కూడా సంపాదించుకున్నారు (లోపాముద్రార్చితా).

9.లలితాసహస్రనామాలు ఏ ఉపాసనకు సంబంధించినవి?

జ. అమ్మ నామాలన్నీ సగుణ బ్రహ్మ ఉపాసనకు సంబంధించినవి. పరబ్రహ్మ తత్త్వంను అంటే నిర్గుణ నిరాకార పరబ్రహ్మన్ని సగుణసాకార రూపంలో ఉపాసించడానికి ఉపయుక్తమైన అక్షరమాలారత్నం లలితా సహస్రనామం.

10.లలితా సహస్రనామస్తోత్రానికి ఋషులు ఎవరు? పేర్లు తెలుపగలరు?

జ. వశిన్యాది వాగ్దేవతలు. వారు ఎనిమిది మంది : వశిని, కామేశ్వరి, మోదిని, విమల, అరుణ, జయిని, సర్వేశ్వరి మరియు కౌళిని.

11. వాక్కు ఎన్నిదశలుగా ఉంటుంది?

జ. వాక్కు నాలుగు దశలుగా ఉంటుంది - పర, పశ్యంతి, మధ్యమ మరియు వైఖరి.

12. కంఠంనుండి పలికి, నోటినుంచి శబ్దం బయటకు రావడానికి (వైఖరి) ఎన్ని స్థానాలు ఉంటాయి?

జ. "వైఖరి"కి ఎనిమిది స్థానాలు ఉంటాయి. కంఠం, తాళువులు (దవడలు), ఓష్ఠములు (పెదవులు), దంతములు, మూర్ధము, ప్రయత్నములు(అభ్యంతర, బాహ్య ప్రయత్నములు) మరియు నాలుక (కరణం).

13. వశిన్యాదిదేవతలు ఎక్కడనుండి వచ్చారు?

జ. వశిన్యాదిదేవతలు అమ్మవారినుండి వచ్చిన తేజోమయమైన కిరణాలు. వీరూ అమ్మవారి రూపాలే. వైఖరిలో వున్న ఎనిమిది స్థానాలకు వీరు అధిదేవతలు.

14. ఈ వాగ్దేవతలు ఎక్కడ ఉంటారు?

జ. శ్రీచక్రంలో బిందువు నుండి మూడవదైన అష్టత్రికోణాల యందు అంటే చతురస్రమునుండి 7 వ ఆవరణలో, అంటే "సర్వరోగహర చక్రం"లో ఉంటారు.

15. వశిన్యాదిదేవతల అనుగ్రహంవలన ఏమి తొలగిపోతాయి?

జ. వశిన్యాదిదేవతల అనుగ్రహంవలన మనస్సులోని (ఆధి), దేహంలోని(వ్యాధి) రోగాలన్నీ తొలగిపోతాయి.

16. మంత్రాలకు అక్షర దేవతలు ఎవరు?

జ. వశిన్యాదిదేవతలు సర్వమంత్రాలకు దేవతలు - ఎలా అంటే, అ - శ వరకు వున్న ఎనిమిది వర్గాలకు దేవతలు వీరే, అన్ని అక్షరాలు ఈ దేవతలే.

17. వశినీ వాగ్దేవత రూపంలో అమ్మవారి అనుగ్రహం ఏమిటి?

జ. అనుకూలింపచేసే మంత్రాలదేవత వశినీ, అవతలవి మనకు అనుకూలం అవడం వశీకరణం.

18. కామేశ్వరి, మోదినీవాగ్దేవతల అనుగ్రహం ఏమిటి?

జ. కామేశ్వరి : కోరికలు తీర్చే మంత్రదేవత. మోదిని : ఆనందం, తృప్తి, అంగీకారమునకు అధిష్టానదేవత.

19. విమల, అరుణ వాగ్దేవతల అనుగ్రహం ఏమిటి?

జ. విమల :నిర్మలమైన జ్ఞానం, విద్యలు కలిగించే దేవత. అరుణ : కరుణ పొందడానికి అధిష్ఠానదేవత.

20. జయిని, సర్వేశ్వరి వాగ్దేవతల అనుగ్రహం ఏమిటి?

జ. జయిని :జయం కలిగించే దేవత. సర్వేశ్వరి :అన్నిటిమీద ఈశత్వం అంటే అధికారం కలిగించే దేవత.

21. కౌళినీ వాగ్దేవత అనుగ్రహం ఏమిటి?

జ. కౌళినీ వాగ్దేవత కుండలినీ యోగానికి సంభందించిన మంత్ర విశేషాలకి దేవత.

22. లలితా సహస్రనామ స్తోత్రమును స్తోత్రము అనుట ఉచితమా?

జ. లలితా సహస్రనామ స్తోత్రం, స్తోత్రమే కాదు. అది ఒక శాస్త్రం. లలితసహస్రనామ "శాస్త్రము" అనుట ఉచితము.

23. లలితా సహస్రనామ శాస్త్రము యొక్క ఆవిష్కరణ ఎక్కడ జరిగింది?

జ. మణిద్వీపములోని చింతామణి గృహంలో అమ్మవారి సభలో జరిగింది.

## ఉపోద్ఘాతం-2

24.గురువులు ఎన్ని రకములు? వారు ఎవరు?

జ. గురువులు మూడు రకములు. వారు దివ్యౌఘు, సిద్ధౌఘు మరియు మానవౌఘు.

25. వేదమునకు లలితా సహస్ర నామమునకు ఉన్న సారూప్యమేమి?

జ. అవి రెండూ అపౌరుషేయములు.

26. వేదమునకు లలితా సహస్రనామమునకు కల వైవిధ్యమేమి?

జ. వేదమును నేర్చుకొనవలెనన అధికారము, విశేషనియమములు ఉన్నాయి. కానీ లలితా సహస్రనామములకు సాధారణ నియమములు చాలు.

27. శాస్త్రములెన్ని రకములు? అవి ఏవి?

జ. శాస్త్రములు రెండు రకములు. అవి ప్రకట శాస్త్రములు, గుహ్య శాస్త్రములు (రహస్య శాస్త్రములు).

28. రహస్య (గుహ్య) శాస్త్రములెన్ని? అవి ఏవి?

జ. రహస్య (గుహ్య ) శాస్త్రములు మూడు రకములు: 1) గుహ్య (ధర్మ శాస్త్రములు) 2) గుహ్య తర (మంత్ర శాస్త్రములు) 3) గుహ్య తమ (బ్రహ్మ విద్య).

29. రహస్య శాస్త్రములకు ఆ పేరు ఎందుకు వచ్చినది?

జ. పైకి నామములుగా కనపడినా ఆ నామములో ధర్మ శాస్త్ర, మంత్ర శాస్త్ర, తత్త్వ శాస్త్రములు నిక్షిప్తమై యున్న కారణమున అవి రహస్య శాస్త్రములు. అలాగే బుద్ధికి, ఇంద్రియాలకు అందని దివ్య శక్తి ఉన్న కారణమున అవి  రహస్య శాస్త్రములు.

30. శ్రీ విద్య భాష్య కర్తలు ఎందరు? అందులో ప్రసిద్ధులైన వారు ఎవరు?

జ. శ్రీ విద్య భాష్య కర్తలు ఏడుగురు. అందులో ప్రసిద్ధులైన వారు భాస్కరరాయల వారు.

31. అమ్మ వారి యోగినీ గణములెన్ని?

జ. అరవై నాలుగు కోట్లు.

32. కాశీలో భాస్కరుల వారు ప్రతిష్ఠించిన లింగమేది?

జ. శ్రీచక్రేశ్వర లింగం. అన్నపూర్ణ అమ్మ వారి గుడిలో కోణ స్థానములో ఉంటుంది. ఆ లింగము యొక్క విశిష్టత ఏంటంటే శ్రీచక్రం లింగము మీద యుండటం.

33. శ్రీవిద్యా భాష్య కర్తలు ఎవరు?

జ. విమర్శానంద నాథ (రెండువేల శ్లోకములు), విద్యారణ్య మునీశ్వరులు (ఒక వెయ్యి ఐదువందల శ్లోకములు), నారాయణ భట్టు (రెండువేలఐదువందల శ్లోకములు), శంకర పండితులు, భాస్కరరాయలు, శ్రీ కళ్యాణానంద భారతి మరియు విమలానంద నాథ.

34. భట్ట నారాయణుల వారి భాష్యము పేరేమి?

జ. జయ మంగళ వ్యాఖ్య.

35. లలితా సహస్రనామం పఠిస్తుంటే వచ్చే కాంతి ప్రకంపనలు ఏ ఆకారము తీసుకుంటాయి?

జ. లలితా సహస్రనామం పఠిస్తుంటే వచ్చే కాంతి ప్రకంపనలు శ్రీచక్ర రూపము తీసుకుంటాయి.

36. భాస్కరరాయల వారి దీక్షానామమేమి?

జ. భాసురానందనాథ.

37. అమ్మవారు లలితా సహస్రనామాలలో ఏ రూపములో ఉన్నారు?

జ. అమ్మవారు లలితా సహస్రనామాలలో మంత్ర రూపిణిగా, ధర్మ రూపిణిగా, తత్త్వ రూపిణిగా ఉన్నారు.

38. ఏ నామముల గుత్తి చదివితే జాతక దోషములు పోవును?

జ. భవదావసుధావృష్టిః పాపారణ్యదవానలా!
దౌర్భాగ్యతూలవాతూలా జరాధ్వాంత రవిప్రభా!
భాగ్యాబ్ధిచంద్రికా భక్తచిత్తకేకిఘనాఘనా
రోగపర్వతదంభోళిః మృత్యుదారుకుఠారికా!

39. భాస్కరరాయల వారి తండ్రి గారి పేరేమి?

జ. గంభీరరాయలవారు. వారు పార్సీ భాషలో భారతం రచించారు.

40. కాశీలో భాస్కరరాయల వారు చతుష్షష్టి యోగినులను చూపిన ఘాట్ పేరేమి?

జ. చౌషష్టి ఘాట్.

40.లలితా సహస్రనామ పారాయణ నిజమైనదిగా ఎలా అవుతుంది?

జ. నిజమైన లలితా సహస్రనామ పారాయణ 1)స్పష్టమైన ఉచ్చారణతో 2) తప్పులు లేకుండా 3) హడావిడి లేకుండా 4) అర్థ స్ఫురణతో 5) ఆదరంగా 6) సంపూర్ణ విశ్వాసంతో చదివితే అవుతుంది.

## ఫల శ్రుతి

41. లలితా సహస్రనామం పఠిస్తున్నప్పుడు ఏమైనా ఉచ్చారణా దోషాలు తొలగాలి అంటే ఏమి చెయ్యాలి?

జ. ఉమా నామం పది సార్లు పఠించాలి. “శ్రీ ఉమాయై నమః" అని పది సార్లు పలకాలి.

42. సంస్కృతం మాత్రమే తెలిసిన వారు లలితా సహస్రనామ అర్థాలు చెప్పవచ్చా?

జ. చెప్పరాదు. ఇంగ్లీషు తెలిసినంత మాత్రాన మెడిసిన్ పుస్తకం ఇచ్చి అర్థం చెప్పలేము. శాస్త్ర గ్రంథం వేరు, భాష వేరు.

43. ఏ విద్య ఐహిక అనుగ్రహం మరియు పారమార్థిక అనుగ్రహం ఇస్తుంది?

జ. లలితా విద్య. లలితా దేవి భుక్తి ముక్తి ప్రదాయిని.

44. ఐహిక అనుగ్రహం కావలసినప్పుడు ఏమని మనస్సులో అనుకోవాలి?

జ. ఐహిక అనుగ్రహం కావలసినప్పుడు, "నా సాధనకు ఆటంకం లేని విధంగా ఇవి లభించు గాక" అని మనస్సులో అనుకోవాలి.

45. సంపదకు సాధనకు ఏమైనా సంబంధం ఉన్నదా?

జ. సంపద సాధనకు సహకరించాలి కాని విఘ్నం కాకూడదు.

46. శ్రీ మాతకు ప్రీతిని కలిగించే స్తోత్రం ఏది?

జ. లలితా సహస్రనామం.

47. సాధన ఎప్పుడూ ఎలా ఉండాలి?

జ. సాధన ఎప్పుడూ సాత్వికంగా ఉండాలి.

48. చింతన ఎప్పుడూ ఎలా ఉండాలి?

జ. చింతన ఎప్పుడూ తాత్త్వికంగా ఉండాలి.

49. అమ్మవారికి ప్రియమైన ఉపాసకుడు ఏమి చేస్తాడు?

జ. సాత్విక సాధన, తాత్త్విక చింతన చేస్తాడు.

50. లలితా ఉపాసనాతత్పరుడైన వాడు ప్రయత్నపూర్వకంగా దేన్ని జపించాలి?

జ. ప్రయత్న పూర్వకంగా లలితా సహస్రనామాన్ని జపించాలి.

51. లలితా సహస్రనామ ఫలశ్రుతి ఏమిటి?

జ. లలితా సహస్రనామ ఫలశ్రుతి ప్రధానంగా: 1) సర్వ రోగ ప్రశమనం 2) సర్వ సంపత్ ప్రవర్ధనం 3) సర్వ అపమృత్యు శమనం 4)అకాల మృత్యు నివారణం 5) సర్వ జ్వర ఆర్తి శమనం 6) దీర్ఘ ఆయుష్షు ప్రదాయకం 7) పురుషార్థప్రదాయకం అని చెప్పబడినది. మరియు ఇంకెన్నో ఫలితాలను లలితా సహస్రనామం ఇస్తుంది. లౌకిక ఫలాలు ఇచ్చినప్పటికీ ప్రధాన పరమార్థం మాత్రం అమ్మవారికి ప్రీతి కలిగించడం.

52. అనుపానం అంటే ఏమిటి?

జ. ఆయుర్వేదంలో మందుతో పాటు తీసుకోవాలిసిన పదార్థాన్ని అనుపానం అంటారు. ఉదాహరణకు మందు నీళ్లతో తీసుకుంటే, నీళ్ళని అనుపానం అంటారు. మందు పాలతోపాటు తీసుకుంటే పాలని అనుపానం అంటారు. అనుపానం మారిస్తే మందు పనిచేయదు. అనుపానం అంత ముఖ్యమైనది.

53. పారాయణానికి, సాధనకు అనుపానం ఏమిటి?

జ. శ్రద్ధ.

54. శ్రద్ధాదేవి ఎవరు?

జ. లలితా దేవికి శ్రద్ధాదేవి అని నామం ఉన్నది. శ్రద్ధా నామం లలితా సహస్రనామంలో కూడా ఉంది.

55. ఎంత కష్టపడినా శ్రద్ధ రాక పోతే ఏం చేయాలి?

జ. శ్రద్ధను ఇవ్వమ్మా అని లలితా అమ్మవారిని అడగాలి. అప్పుడు అమ్మే శ్రద్ధను ఇస్తుంది.

56. పాపాలు వచ్చే రెండు విధాలు ఏమిటి?

జ. పాపాలు వచ్చే రెండు విధాలు : నిత్య కర్మలు (విధి) మాని వేయటం వల్ల. చేయకూడని పనులు (నిషేధం) చేయటం వల్ల.

57. లలితా సహస్రనామంలో ఒక్కొక్క నామానికి ఎలాంటి శక్తి ఉంటుంది?

జ. లలితా సహస్రనామంలో ఒక్కొక్క నామానికి కోటి పాపాలను పోగొట్టే శక్తి ఉంటుంది.

58. ఒక వేళ నిత్యానుష్టానంగా లలితా సహస్రనామం పఠించటానికి వీలుకాకపోతే ఏ రోజుల్లో పఠించాలి?

జ. నిత్యానుష్టానంగా లలితా సహస్రనామం పఠించటానికి వీలుకాకపోతే, సంక్రాంతి, విషువులు (equinox/solstices), పుట్టిన రోజు నుంచి మూడవ రోజు, శుక్ల పక్ష నవమి, శుక్ల పక్ష చతుర్దశి మరియు శుక్రవారం పఠించాలి. పౌర్ణమి రోజున మరింత విశేషంగా పఠించాలి.

## శ్రీమాత్రే నమః

59. రెండు అక్షరముల మంత్రములను ఏమంటారు?

జ. రెండు అక్షరముల మంత్రములను కర్తరీ మంత్రములు అంటారు.

60. మాలా మంత్రములని వేటిని అంటారు?

జ. ఇరువది అక్షరముల కన్నా ఎక్కువ అక్షరములు ఉన్న మంత్రములను “మాలా మంత్రములు” అంటారు.

61. శ్లోక పాదములో ఎన్ని అక్షరములు కలవు?

జ. శ్లోక పాదములో పదహారు అక్షరములు కలవు.

62. లలితా సహస్రనామస్తోత్రములో ఎన్ని శ్లోకములు ఉన్నాయి?

జ. లలితా సహస్రనామస్తోత్రములో నూటఎనభైరెండున్నర శ్లోకములు ఉన్నాయి.

63. లలితా సహస్రనామస్తోత్రము ఏ ఛందస్సులో చెప్పబడింది?

జ. అనుష్టుప్ ఛందస్సు.

64. వశిన్యాది వాగ్దేవతలు పలికిన మొట్టమొదట అద్భుత నామము ఏది?

జ. శ్రీ మాత.

65. విత్తనాన్ని సంస్కృతంలో ఏమంటారు?

జ. బీజం.

66. అమ్మవారి యంత్రం పేరు ఏమిటి?

జ. శ్రీ చక్రం.

67. అమ్మవారి విద్య పేరు ఏమిటి?

జ. శ్రీ విద్య.

68. శ్రీ అనగానేమి?

జ. శ్రీ అంటే 1)శోభ 2)ప్రకాశం 3) విభూతి (ఇవి ముఖ్యమైనవి. గురువుగారు ఇంకా ఎన్నో వివరించారు).

69. లలితా సహస్రనామస్తోత్రములో ఎన్ని వైభవాలు చెప్పబడ్డాయి? అవి ఏమిటి?

జ. లలితా సహస్రనామస్తోత్రములో ఆరు వైభవాలు చెప్పబడ్డాయి. అవి నామ, రూప, లీల, తత్వ, మంత్ర, యోగ వైభవములు.

70. లలితా సహస్రనామస్తోత్రములో లలిత నామము ఎన్నిసార్లు వస్తుంది?

జ. ఒక్కసారి - చివరన.



71. సృష్టి, స్థితి, లయ చేసే శక్తి ఎవరిది?

జ. పరమేశ్వరునిది.

72. పగలుని ఎవరి రూపంగా పిలుస్తారు?

జ. శివ రూపంగా.

73. రాత్రిని ఎవరి స్వరూపంగా పిలుస్తారు?

జ. శక్తి స్వరూపం.

74. మాత అంటే అర్థం ఏమిటి?

జ. మాత అంటే కారణమైనది.

75. సర్వ జీవులకు ఆధారమైనది ఎవరు?

జ. సర్వ జీవులలకు ఆధారమైనది “శక్తి”.

76. శ్రీ మాత అనే నామమునకు రెండు అర్థములు చెప్పండి?

జ. శ్రీ మాత అనే నామమునకు రెండు అర్థములు: ఆశ్రయమైన శక్తి, సృష్టికి కారణమైనది.

77. సృష్టిలో నెపం చూడకుండా ప్రేమించగలిగేది ఎవరు?

జ. అమ్మ.

## శ్రీ లలితా మాత ఆవిర్భావం

78. మొదటి పాదంలో మాతృకావర్ణ రహస్యాలు ఉన్న నామం ఏది?

జ. మాతృకావర్ణ శక్తి దాగివున్న నామం “శ్రీమహారాజ్ఞి”.

79. సృష్టి యొక్క ఆది, మరియు దాని యొక్క స్పందన శక్తి ని తెలిపే అక్షరములు ఏవి?

జ. సృష్టి యొక్క ఆది ని 'అ' అక్షరం మరియు స్పందనని 'హ' అక్షరం తెలియ చేస్తున్నవి.

80. అమ్మవారు ఎవరి చేత పూజింప బడుతుంది?

జ. అందరి చేత.

81. మనకు జన్మ లేక పోయినా ఉండే తల్లి ఎవరు?

జ. జగన్మాత (శ్రీమాత).

82. అమ్మవారి సింహాసనం పేరు ఏమిటి?

జ. శ్రీ చక్రమే అమ్మవారి సింహాసనము.

83. లలితా సహస్రనామముల గురించి తెలుసుకోవడం అంటే ఏమిటి?

జ. లలితా సహస్రనామముల గురించి తెలుసుకోవడం అనగా అమ్మ అంటే ఎవరో తెలుసుకోవడము.

84. ఆసనం అంటే ఏమిటి?

జ. ఆసనం అంటే కూర్చునే చోటు. ఉండే చోటు.

85. అమ్మవారి పంచ ఆసనములు ఏవి?

జ. అమ్మవారి ఆసనములు ఐదు. మరియు అవి ఒక్కొక్కటి అయిదు. అవి పంచ ప్రణవాలు, పంచ దిగాసనాలు, పంచ భూతములు, పంచ ప్రేతాసనములు / పంచ బ్రహ్మాసనములు, పంచ కళాసనములు.

86. పంచ దిగాసనాలు అంటే ఏవి?

జ. నాలుగు దిక్కులు, ఊర్ధ్వ దిశ.

87. పంచ బ్రహ్మలు అంటే ఎవరు?

జ. బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర మరియు సదాశివ.

88. పంచ కళాసనలు ఏవి?

జ. నివృత్తి కళ, ప్రతిష్ట కళ, విద్యా కళ, శాంతి కళ మరియు శాంత్యతీత కళ.

89. అంత తేలికగా అర్ధం కానీ లలితా సహస్ర నామములు, అర్ధం కావాలి అంటే మనకు ఏమి ఉండాలి?

జ. లలితా సహస్ర నామములు అర్ధం కావాలి అంటే : 1)ఆసక్తి ఉండాలి 2) శ్రద్ధ ఉండాలి 3) చెప్పిన దానిని నిలబెట్టుకోవాలి 4) ఇది ముఖ్య మైనది అనేటటువంటి నిష్ఠ ఉండాలి. అప్పుడు లలితా సహస్రం అర్ధం అవుతుంది.

90. లలిత సహస్ర నామములలో మొదటి మూడు నామములకి ఉన్న సమిష్టి అర్ధం ఏమిటి?

జ. మొదటి మూడు నామములకు ఉన్న సమిష్టి అర్ధం: సృష్టి (శ్రీ మాతా), స్థితి (శ్రీమహారాజ్ఞి), లయకారిణి (శ్రీ మత్సింహాసనేశ్వరి).

91. రాక్షస జాతి అంటే ఏమిటి?

జ. అధర్మంగా ప్రవర్తిస్తూ ప్రపంచానికి నష్టం కలిగించే జాతిని రాక్షస జాతి అంటారు.

92. ఏ గుణములు ఉన్నవాడు అమ్మను ఆశ్రయిస్తే, అతని కొరకు అమ్మ వస్తుంది?

జ. దైవీ గుణములు ఉన్నవాడు ఆశ్రయిస్తే అతనిని కాపాడడం కొరకు అమ్మ వస్తుంది.

93. దైవీగుణములు వున్న వారు ఎలా ఉంటారు?

జ. దైవీగుణం కలవారు ఎప్పుడూ వారు "బాగుపడడం" మరియు "లోకమును చెడు నుండి రక్షించడం" చేస్తూ ఉంటారు.

94. అగ్ని వలన ఉపయోగాలు ఎన్ని?

జ. అగ్ని వలన ఉపయోగాలు :1) వెలుగు 2) వేడిమి. వేడిమి తగలపెడుతుంది. వెలుగు వెలగ పెడుతుంది.

95. చిదగ్ని ఎప్పుడు ఎక్కడ ఉన్నది?

జ. చిదగ్ని అనగా పరమాత్మ. అగ్ని అనగా ముందు ఉన్నది . "జ్ఞాన"రూపంలో సృష్టికి మొదలే ఉన్నది చిదగ్ని. "చిదగ్నికుండ సంభూత" అంటే పరబ్రహ్మ యందు ఆవిర్భవించిన శక్తి .




96. పరమేశ్వరుడి పనులు ఏమిటి?

జ. పరమేశ్వరుడని పనులు : సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహములు (పంచకృత్యములు).

97. భగవత్ సాక్షాత్కారం కలిగినప్పుడు ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు?

జ. భగవత్ సాక్షాత్కారం కలిగినప్పుడు ఎలా ఉంటుందో యోగులు వర్ణించగలరు.

98. "చతుర్బాహుసమన్వితా"అంటే అర్థం ఏమిటి?

జ. చతుర్బాహు అంటే ఒక అర్థం "నాలుగు చేతుల తల్లి". ఇంకొక అర్థం " చతురస్రం" అని. చతురస్రం అంటే త్రైలోక్య మోహన చక్రం. శ్రీ చక్రంలో కనబడే ప్రథమ ఆవరణ చతురస్రం. చతురస్రంతో కూడిన శ్రీ చక్రం. "చతుర్బాహు సమన్వితా" అంటే నవ ఆవరణ శ్రీచక్రం చిదగ్ని కుండంలో గోచరించింది.

99. బృందావనంలో ఉన్న మహాయోగీశ్వరుడు దేవహార బాబా చెప్పిన సాధన విధానం ఏమిటి?

జ. దేవహార బాబా సాధనను ఇలా వివరించారు. అందరి దగ్గర ఒక కర్ర ఉంది, అదే మనసు. ఇంకొక కర్ర "రామ నామము". ఈ రెండు రుద్దాలి . అప్పుడు అగ్ని పుడుతుంది. పుట్టిన అగ్ని రెండు కర్రలనూ తగలబెడుతుంది, అంటే నామాన్ని, మనసుని తీసేస్తుంది. ఇక మిగిలేది ఒక "రామ బ్రహ్మమే". "అంతర్నిరంతరమనింధన మేధమానే, మోహాంధకారపరిపంథిని సంవిధగ్నే"

100. పతంజలి సూత్రం సాధనా విధానం ఎలా ఉండాలి అని చెప్పింది?

జ. "స తు దీర్ఘ కాల నైరన్తర్యా సత్కార ఆదరా ఆసేవితో ధృడ భూమిః - అంతరాయం లేకుండా చాలా కాలం శ్రద్ధతో సాధన చెయ్యాలి అని.

## అమ్మవారి రూప లావణ్యం

101. లలితా అమ్మవారి చేతులలో ఏ ఆయుధాలు ఉన్నాయి?

జ. లలితా అమ్మవారి చేతులలో ఉన్న ఆయుధాలు: పాశం, అంకుశం, చెఱకు విల్లు, ఐదు పువ్వుల బాణాలు.

102. పాశం దేనికి సంకేతం?

జ. పాశం రాగానికి (Attachment) సంకేతం.

103. అంకుశ ధ్యానం దేనిని పోగొడుతుంది?

జ. అంకుశ ధ్యానం క్రోధాన్ని పోగొడుతుంది.

104. అమ్మవారి రూపం తత్త్వపరంగా ఎలా వివరించారు?

జ. అమ్మవారి రూపం తత్త్వపరంగా యంత్రం గాను, కాంతి గాను (విమర్శ) వివరించారు.

105. ఐదు పువ్వుల బాణాలు దేనికి సంకేతం?

జ. ఐదు పువ్వుల బాణాలు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములకు సంకేతం.

106. చెఱకు విల్లు దేనికి సంకేతం?

జ. చెఱకు విల్లు మనస్సుకి సంకేతం.

107. అమ్మవారి రూపంలో స్థాణువుగా ఉన్న దానిని ఏమని అంటారు?

జ. అమ్మవారి రూపంలో స్థాణువుగా ఉన్న దానిని "ప్రకాశ" రూపం అని అంటారు. అదే "శివ" తత్త్వంగా వివరించారు.

108. అమ్మవారి రూపంలో కాంతిగా ఉన్నదానిని ఏమని అంటారు?

జ. అమ్మవారి రూపంలో కాంతిగా ఉన్నదానిని "విమర్శ" రూపం అని అంటారు. అదే "శక్తి" తత్త్వంగా వివరించారు.

109. అమ్మవారి కాంతి వైభవం గురించి ఏ నామములో వివరించారు?

జ. "నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలా".

110. అమ్మవారి కచలో ఎన్ని రకాల పువ్వులు అలంకరింపబడ్డాయి?

జ. అమ్మవారి కచ చంపకము, అశోకము, పున్నాగము, సౌగన్ధికము అనే పువ్వులతో అలంకరింపబడి ఉన్నది.

111. అమ్మవారి కచ ధ్యానము ఏ బాధలు పోగొడుతుంది?

జ. అమ్మవారి కచ ధ్యానము నరక బాధలు పోగొడుతుంది.

112. అమ్మవారి కచ ఏ శక్తికి  చిహ్నం?
జ. అమ్మవారి కచ "కాల" శక్తికి చిహ్నం.
113. అమ్మవారి స్వరూపం ఎలా ధ్యానం చేయాలి?
జ. అమ్మవారి స్వరూపం అలౌకిక రూపంగా, విశ్వ విగ్రహంగా (విరాట్ స్వరూపంగా), మంత్ర విగ్రహంగా, దేవతా విగ్రహంగా ధ్యానం చేయాలి.



114. అమ్మవారి కిరీటం ఎలా ప్రకాశిస్తోంది?
జ. అమ్మవారి కిరీటం సూర్య కాంతి వలే ప్రకాశిస్తోంది.
115. అందరిలో ఉండే ఆత్మ  చైతన్యాన్ని ఏమంటారు?
జ. అందరిలో ఉండే ఆత్మ  చైతన్యాన్ని "శివ తత్త్వం" మరియు "ప్రకాశ తత్త్వం"  అంటారు.
116. అందరిలో ఉండే శక్తి ఏమిటి?
జ. అమ్మవారి "కాంతియే" అందరిలో శక్తిగా  ఉంటుంది.

## అమ్మవారి ఆభరణ తత్త్వం

117.  అమ్మవారి లలాటం అష్టమి నాటి చంద్రునితో పోల్చడంలోని ఆంతర్యం ఏమిటి?
జ.  అష్టమి నాటి శుక్ల పక్ష, కృష్ణ పక్షముల చంద్ర కళలు ఒకేలా ఉంటాయి. అలాగే అమ్మవారి స్వరూపం నిర్వికారమైన స్వరూపం అని చెప్పడం ఇందులోని ఆంతర్యం.
118. కృష్ణ పక్ష, శుక్ల పక్ష అష్టమి దేవత పేరు ఏంటి?
జ. "త్వరిత".
119. త్వరిత అంటే అర్థం ఏమిటి?
జ. త్వరిత అంటే తొందరగా/ శీఘ్రముగా ఫలమును ఇస్తుంది అని అర్థం.
120. అమ్మ వారి నుదుటిని ధ్యానం చేస్తే సాధనలో ఎంత దూరం వెళ్లినట్లు?
జ. అమ్మ వారి నుదుటిని ధ్యానం చేస్తే సాధనలో సగం దూరం వెళ్లినట్లు.
121. మృగనాభి అంటే అర్థం?

జ. మృగనాభి అంటే కస్తూరి అని అర్థం. కస్తూరి మృగం యొక్క నాభి నుండి కస్తూరి వస్తుంది. కనుక "మృగనాభి" అన్నారు.



122. అమ్మవారి ముఖములో ఉన్న తేజస్సు ఎవరిది?

జ. అమ్మవారి ముఖములో ఉన్న తేజస్సు శంభుని తేజస్సు.

123. ఆజ్ఞాచక్రస్థానంలో తిలకము ధారణ చేయడంలోని ప్రత్యేకత ఏమిటి?

జ. అమ్మవారిని భావన చేసేటప్పుడు ఆజ్ఞాచక్రం యందు భావన చేస్తారు. ఈ స్థానం దాకా యోగి చేరగలిగితే ఇంక పరమపదానికి చేరినట్టే . అందుకే ఈ భాగమంతా పరమపద స్థానం  కాబట్టి, ఈశ్వర ఆరాధన ఇక్కడ చెయ్యాలి. భగవత్ స్థానం ప్రకటించబడే చోటు కాబట్టి పరమపదానికి సంకేతంగా ఫాలభాగంలో తిలకధారణ, భస్మధారణ మొదలగునవి చేస్తారు.

124. న్యాసం అంటే అర్థం?

జ. న్యాసం అంటే "ఉంచుట", దైవ శక్తిని ఉంచుట అని అర్థం.

125. అమ్మవారి కనుబొమ్మలు వేటితో పోల్చారు?

జ. అమ్మవారి వదనములో సౌందర్యం (స్మర), మరియు శోభా/ శుభము  (మాంగళ్యం) ఇల్లు కట్టుకొని
కూర్చున్నాయి. అమ్మవారి కనుబొమ్మలు అమ్మవారి ముఖము/ వదనము అనే ఇంటికి తోరణాల వలె ప్రకాశిస్తున్నాయని పోల్చారు.

126. "వదనస్మరమాంగళ్యగృహతోరణచిల్లికా" నామంలో దాగి ఉన్న ఐదు శక్తులు ఏమిటి?

జ. "వదనస్మరమాంగళ్యగృహతోరణచిల్లికా"నామంలో దాగి ఉన్న ఐదు శక్తులు: 1) వాక్ / శబ్ద శక్తి, 2) ఆకర్షణ శక్తి 3)విద్యుత్ శక్తి 4) ఉష్ణత శక్తి  5) కాంతి శక్తి. ఈ ఐదు శక్తులకు "మూలమైన శక్తి" అమ్మవారు. ఈ శక్తులన్నిటినీ అమ్మవారు తన కనుబొమ్మలతో నడిపిస్తోంది.

127. ఈశ్వరుని స్పందన శక్తిని ఏమని అంటారు?

జ. ఈశ్వరుని స్పందన శక్తిని సంకల్పం అంటారు.

128. ఈశ్వరుని శక్తి యొక్క స్పందన మొట్టమొదట ఏ రూపంలో వచ్చింది?

జ. ఈశ్వరుని శక్తి యొక్క స్పందన మొట్టమొదట "బిందువు" రూపంలో వచ్చింది.

129. పరమేశ్వరుని ప్రథమ స్పందన శక్తి ఎలా వ్యాపించింది?

జ. పరమేశ్వరుని ప్రథమ స్పందన శక్తి తరంగాలు తరంగాలుగా వ్యాపించింది.

130. అమ్మవారి ముఖంలోని సౌందర్యాన్ని ప్రవాహంతో పోల్చడంలోని ఆంతర్యం ఏమిటి?

జ. ప్రవాహం అంటే ఎప్పటికప్పుడు స్వచ్ఛంగా ఉంటుందే తప్ప పాతది కాదు. అమ్మ వారి నిత్యనూతన సౌందర్యాన్ని ప్రవాహమని చూపిస్తున్నారు.

131. అమ్మవారి నాసాదండము ఎలా ప్రకాశిస్తోంది?

జ. అమ్మవారి నాసాదండము నూతనముగా వికసించిన (అప్పుడే విచ్చుకున్న, ఇంకా పూర్తిగా విచ్చుకోని) సంపంగి పువ్వు వలె ప్రకాశిస్తున్నది.

132. అమ్మవారి నాసాదండము ఏ మంత్రస్వరూపంతో చెప్పబడుతోంది?

జ. అమ్మవారి నాసాదండము “అజపా" మంత్ర స్వరూపంతో చెప్పబడుతోంది.

133. అమ్మవారి నాసాదండము యొక్క తత్త్వస్వరూపం ఏమిటి?

జ. అమ్మవారి నాసాదండము యొక్క తత్త్వ స్వరూపం “ప్రాణ శక్తి” అని చెప్పబడుతుంది.

134. అమ్మవారి నాసాభరణాల సంకేత విశేషం ఏమిటి?

జ.ముక్కుకి కుడివైపు ఉన్న పగడంతో చేసిన ముక్కెర శుక్ర గ్రహానికి సంకేతం, ఎడమవైపు ఉన్న వజ్రపు ముక్కెర కుజ గ్రహానికి సంకేతం, మధ్యలో ఉన్న బులాకీ ఆణిముత్యం.

135. అమ్మవారి నాసాభరణాలకి నాడీ మండలానికి ఉన్న సంకేతార్థం ఏమిటి?

జ. పగడం సూర్యునికి మరియు పింగళానాడికి సంకేతం. వజ్రం చంద్రునికి మరియు ఇడా నాడికి సంకేతం. ముత్యం సుషుమ్నా నాడికి సంకేతం.

136. అమ్మవారి చెవులు ఏ తేజస్సుకు సంకేతం?

జ. అమ్మవారి చెవులు వాయు తేజస్సుకు సంకేతం.

137. తపన మండలము, ఉడుప మండలము అంటే అర్థం ఏమిటి?

జ. తపన మండలము అనగా సూర్య మండలం, ఉడుప మండలం అనగా చంద్ర మండలం.

138. సూర్యచంద్రులు అమ్మవారిని ఏయే స్థానాలలో ఉండి కొలుచుకుంటారు?

జ. సూర్యచంద్రులు అమ్మవారిని నేత్ర స్థానమునందు, వక్షస్థలమునందు, శ్రవణ స్థానము నందు ఉండి కొలుచుకుంటారు.

139. సూర్యచంద్రులు అమ్మవారి నేత్ర స్థానములయందు ఉండి ఈ విశ్వంలో చేసే కార్యం ఏమిటి?

జ. సూర్యచంద్రులు విశ్వంలో సాక్షిగా ఉంటూ ప్రతీది గమనిస్తూ ఉంటారు.

140. సూర్యచంద్రులు అమ్మవారి వక్షస్థలమునందు ఉండి ఈ విశ్వంలో చేసే కార్యం ఏమిటి?

జ. పోషక శక్తి రూపంలో ఉండి మన పోషణ అంతా చూసుకుంటారు.

141. సూర్యచంద్రులు అమ్మవారి చెవుల వద్ద ఉండి ఈ విశ్వంలో చేసే కార్యం ఏమిటి?

జ. సూర్యచంద్రులు అమ్మవారి చెవుల వద్ద ఉండి అమ్మ వారికి చూసింది చెప్పటం జరుగుతుంది.

142. అమ్మవారి నాసాభరణాలు ఏ కాంతిని తిరస్కరిస్తున్నట్లుగా ఉన్నాయి?

జ. అమ్మవారి నాసాభరణాలు నక్షత్రాల కాంతిని తిరస్కరిస్తున్నట్లుగా ఉన్నాయి.

## మంగళవదన ధ్యానం

143. అమ్మవారి కపోలములు/బుగ్గలను వేటితో పోల్చారు?

జ. అమ్మవారి కపోలములు/ బుగ్గలు సాన పట్టిన పద్మరాగ మణులతో పోల్చారు. వాటిలో అమ్మవారి వదనంకి ఉన్న ఎఱ్ఱదనం ఉంది, అద్దం లాగ పారదర్శకత్వం కూడా ఉంది. అందుకు వాటితో పోల్చారు.

144. రదనచ్ఛదా అంటే ఏమిటి?

జ. రదనచ్ఛదా అంటే వాతెర (వాక్ తెర).

145. అమ్మవారి వాక్ తెరని వేటితో పోల్చారు?

జ. ఓష్టాన్ని అంటే పైపెదవిని కొత్త పగడముతో పోల్చారు. అమ్మవారి పైపెదవి దీన్ని మించి ప్రకాశిస్తోంది. అమ్మవారి క్రింది పెదవిని, అంటే అధరాన్ని, దొండ పండుతో పోల్చారు. అమ్మవారి అధరము దొండ పండు కంటే గొప్పగా ప్రకాశిస్తోంది.

146. అమ్మవారి పలువరుస ఎలా ఉంది?

జ. అమ్మవారి పలువరుస మరియు దంతములు వేద వేత్తలు, ఉపాసకుల వలే ప్రకాశిస్తున్నాయి. శుద్ధ విద్య యొక్క (అంకురము) మొలక వలే ఉంది.

147. అమ్మవారి పలువరుస శ్రీవిద్య విద్యలకు ఎలా అన్వయం చేసారు?

జ. దత్తాత్రేయ సంహితలో చెప్పబడిన ముప్పైరెండు శ్రీవిద్యా విశేషములు, అదేవిధంగా వశిష్ఠ ఆగమంలో చెప్పబడిన పదహారు శ్రీవిద్యా విశేషములు, వాటి యొక్క శివశక్తి

భాగములు ,అలాగే మహాషోడశీవిద్యలో చెప్పబడుతున్న పదహారు అక్షరములు, వాటి యొక్క శివశక్తి భాగములతో అన్వయం చేసారు.

148. వశిష్ఠ ఆగమంలో చెప్పబడిన శ్రీవిద్య విద్యలు ఏమిటి?

జ. శుద్ధ విద్య, బాల విద్య, మాతంగి విద్య, గురుపాదుక విద్య, గణపతి మంత్రం, సౌభాగ్య మంత్రం, వారాహీ విద్య, తిరస్కరిణి విద్య, లోపాముద్రా విద్య, తురీయాంబ విద్య, ప్రాసాది విద్య, షోడశీ విద్య, పరషోడశి విద్య, మహాపాదుకా విద్య.

149. మాతృకా వర్ణములకు అమ్మవారి పలు వరుసకు సామ్యము ఎలా చెప్పారు ?

జ. మాతృకా వర్ణములు మొత్తం యాభై. కానీ అందులో కొన్ని విస్తార అక్షరములు (ఉదాహరణకి అ, ఆ, ఇ, ఈ ల లో విస్తార అక్షరాలు ఆ ఈ). ఇలా పద్దెనిమిది విస్తార అక్షరములు మినహాయిస్తే ముప్పైరెండు అక్షరములు వస్తాయి. అవి అమ్మ వారి పలు వరుస.

150. శుద్ధ విద్య అంటే?

జ. శుద్ధ విద్య అంటే బ్రహ్మ విద్య. "ఇదంతా అదంతా" భేదము లేనిది శుద్ధ విద్య (ఇది అంత – ఇదం అని సంస్కృతంలో). ఇదం అంటే ప్రపంచం/ జగత్, అహం పరమాత్మ.

151. అమ్మవారి పలువరుస ఏ తేజస్సుతో ఉన్నది?

జ. అమ్మవారి పలువరుస అక్షర తేజస్సు, మంత్ర తేజస్సు మరియు విద్యా తేజస్సుతో ఉన్నది.

152. అమ్మవారి పలువరుసను వేదవేత్తలతో ఎలా అన్వయం చేశారు?

జ. వేదపఠనం చేసేటప్పుడు వేదవేత్తలు ధవళ (శుభ్రమైన తెల్ల) వస్త్రములు ధరించి, భస్మధారణ చేసుకొని రెండు వరుసల్లో కూర్చుంటారు. పదహారు మంది ఒక వైపు, మరో పదహారు మంది ఇంకొక వైపు కూర్చుంటారు. అలా కూర్చుని ఉన్న వేదవేత్తల తీరు ఎంత అందంగా ఉంటుందో అమ్మవారి పలువరస అంత అందంగా ఉంటుంది. బ్రాహ్మణులు వేదాలు వల్లె వేస్తున్నారు, అలాగే అమ్మవారి దంతములు సమస్త వేదవాఙ్మయాన్ని మనకి అందిస్తున్నాయి.

153. అమ్మవారిని విశ్వవిరాట్ గా చెప్పుకున్నప్పుడు దంతములు ఎవరి రూపం?

జ. ప్రజాపతుల రూపం.

154. అమ్మవారి కర్పూర వీటికా తాంబూలం ధ్యానం చేస్తే ఏమి వస్తుంది?

జ. అమ్మవారి కర్పూర వీటికా తాంబూలం ధ్యానం చేస్తే ఆకర్షించి వ్యాపించగలిగే కీర్తి, జ్ఞానం భక్తులకు లభిస్తుంది.

155. అమ్మవారి కర్పూర వీటికా తాంబూలం ఎలా తయారుచేస్తారు?

జ. త్రికరణశుద్ధిగా నిజమైన భక్తితో, శుభ్రమైన, లేతదనంతో ఉన్న తమలపాకులను వాటి కొనలు తీసి యాలుకలు, లవంగాలు, పచ్చ కర్పూరం, కస్తూరి, కుంకుమపువ్వు, జాజికాయ, జాపత్రి, వక్కలు, చలవమిరియాలు, కాచుతో తయారుచేస్తారు.

156. అమ్మవారి పలుకులు ఎలా ఉన్నాయి?

జ. అమ్మవారి పలుకులు మధురంగా తీయగా ఉన్నాయి. వింటున్న కొద్దీ వినాలి అనిపించేటట్లు ఉన్నాయి.

157. కచ్ఛపీ వీణ ప్రతేకత ఏమిటి?

జ. కచ్ఛపీ వీణ ప్రతేకత ఏంటంటే అది స్వరాన్నే కాకుండా అక్షరాన్ని కూడా పలికించగలదు.

158. అమ్మవారి పలుకులు కచ్ఛపీ వీణను మించింది అంటే ఏమిటి?

జ. విద్యల తల్లి సరస్వతి దేవి కంటే మించిపోయింది. అంటే అమ్మ పలుకులు ఈ విద్యలు అన్నిటికీ మూలము అని చెప్పటం ఇక్కడ విశేషం.

159. అమ్మవారి మందస్మిత తలచుకుంటే ఏమి వస్తుంది?


జ. జ్ఞానము, ఆనందం రెండూ వస్తాయి.

160. అమ్మ చిరునవ్వులో ______ మనస్సు మునకలు వేస్తోంది (ఖాళీ పూరించండి).

జ. శివుడి.

161. అమ్మ చిరునవ్వులో ______ ప్రవాహం కనిపిస్తుంది (ఖాళీ పూరించండి).

జ. శివశక్తి.



162. సమయాచారము అంటే ఏమిటి?

జ. అమ్మవారిని ఆరాధిస్తునప్పుడు అయ్యవారి స్ఫురణ ఉండాలి .ఇదియే సమయాచారము. సమత్వం అంటే శివ శక్తులను సమముగా భావించడం.

163. చుబుక శ్రీ అంటే ఏమిటి?

జ. గడ్డపు శోభ/ సొగసైన గడ్డం కలదానా అని అర్థం.

164. అమ్మవారి కంఠం చూడగానే మనకి ఏమి గుర్తు రావాలి?

జ. మంగళ సూత్రం, శివ పార్వతుల కళ్యాణం.

165. మంగళసూత్రంలో ముప్పేటలు ఒక్కొక్క దానిలో తొమ్మిది సూత్రములు చొప్పున కట్టి ఉంచిన ఇరువై ఏడు నక్షత్రాల సంఖ్య సంకేతం ఏమిటి?

జ. ఇరువై ఏడు నక్షత్రాలు అంటే సంపూర్ణమైన కాల సంఖ్య. ఈ కాలమంతా కూడా ఐదవతనం మాంగళ్యము ఉండటం కోసం అని సంకేతం. ఈ నామం సంపుటీకరణ చేసి పారాయణ చేస్తే పెళ్లి కానీ వారికి వివాహం జరుగుతుంది, మాంగళ్యము కలుగుతుంది. సువాసిన్యత్వం పెరుగుతుంది.

## అమ్మవారి రూప లావణ్యం

166. అమ్మవారి కంఠ ఆభరణాలను ఎలా భావించాలి?

జ. అమ్మవారి కంఠ ఆభరణాలను మంత్ర సంకేతాలుగా భావించాలి.

167. అమ్మవారు ఎప్పుడు ముక్తాఫలం ప్రసాదిస్తారు?

జ. అమ్మ వారి మంత్రాన్ని కంఠంలో పలుకుతూ అందులో లీనమై చింతన చేయాలి. అలా చేస్తే అమ్మ వాళ్ళకి "ముక్తాఫలం" ప్రసాదిస్తారు, అంటే మోక్ష ఫలం ప్రసాదిస్తారు.

168. శివుని ప్రేమ రత్నాన్ని అమ్మవారు మనకు ఎలా ప్రసాదిస్తున్నారు?

జ. అమ్మవారు శివుని ప్రేమ రత్నాన్ని తీసుకొని రెండింతలుగా చేసి మనకు ప్రసాదిస్తున్నారు.

169. సూర్యచంద్రుల ద్వారా వచ్చిన అమృతాన్ని ఎవరు పంచుకున్నారు?

జ. దేవతలు, పితృ దేవతలు మరియు సర్వ జీవులు పంచుకున్నారు.

170. పరబ్రహ్మను సూచించే మంత్రము ఏది?

జ. ఓంకారం.

171. అమ్మవారి నాభిని ఎలా భావన చేయాలి?

జ. అంతరిక్షంగా దర్శించాలి (లలితా విశ్వవిగ్రహ).

172. అమ్మ మొలనూలుకు ఉన్న ______ మోగుతున్నాయి (ఖాళీ పూరించండి).

జ. మువ్వలు.

173. మహాబిల స్థానం అంటే ఏమిటి?

జ. మూలాధారము నుంచి మణిపూరము వరకు ఉన్న స్థానం.

174. అమ్మ వారి నడుమును శూన్యంతో ఎందుకు పోల్చారు?

జ. అమ్మ వారి నడుము ఉందా లేదా అన్నట్టు ఉండటంవల్ల అలా పోల్చారు.

175. అమ్మవారి మోకాళ్లు ఎలా ఉన్నాయని వర్ణించారు?

జ. అమ్మ వారి మోకాళ్ళు మాణిక్యంతో చేసిన కిరీటాల్లాగా ఉన్నాయని వర్ణించారు.

176. అమ్మవారు ఈ ప్రపంచాన్ని ఎలా పోషిస్తున్నారు?

జ. అమ్మవారి వక్షస్థలం మాతృ స్థానం. ఈ ప్రపంచాన్నే పోషించే స్థలం.

177. అమ్మవారి కాలిపిక్కలు ఎలా ఉన్నా యని వర్ణించారు?

జ. అమ్మవారి కాలి పిక్కలు మన్మధుడి అమ్ములపొదలాగా ఉన్నాయని వర్ణించారు.

178. గురుపాదుకా మంత్ర రహస్యాలు ఎవరి ద్వారా తెలుసుకోవాలి?

జ. శివాయ గురవే నమః. కేవలం గురువు ద్వారా మాత్రమే తెలుసుకోవాలి.

179. అమ్మవారి కాలిపిక్కలు ______రంగులో ఉన్నాయని వర్ణించారు (ఖాళీ పూరించండి).

జ. ఆరుద్ర పురుగుల రంగు (ఎఱుపు రంగు).

180. అమ్మ వారి పాదాలను తాబేలు పై డిప్పతో ఎందుకు పోల్చారు?

జ. అమ్మ వారి పాదాలను తాబేలు పై డిప్పతో ఎందుకు పోల్చారు అంటే, మునిగి పోతున్న మందర పర్వతాన్ని ఆదికూర్మం ఎలా రక్షించిందో, అలాగే సంసారంలో మునిగి పోతున్న జీవులను ఎత్తి ఉద్ధరించగలవు అమ్మ దివ్య పాదాలు. అందుకు అలా పోల్చారు.

181. అమ్మవారి పాదాలు ఏ రంగులో ఉన్నాయి?

జ. ఎఱ్ఱ రంగులో ఉన్నాయి.

182. శ్రీవిద్యలో మహా వాక్యాలు ఎప్పుడు చెప్తారు?

జ. పూర్ణ దీక్షలో.

183. అమ్మవారి గోళ్లు ఏ రంగులో ఉన్నాయని, ఎలా మెరిసి పోతున్నాయని వర్ణించారు?

జ. అమ్మవారి గోళ్లు తెల్లగా ఉన్నాయని, చందమామని పది ముక్కలుగా చేసి పెట్టినట్టు ఉన్నాయని వర్ణించారు.

184. చిదగ్ని కుండం నుంచి వచ్చిన అమ్మవారు మొట్టమొదట ఎవరిని చూశారు?



జ. అమ్మవారు ముందు శివుడిని చూశారు.

## అమ్మవారి పాద కమల సేవ

185. శింజాన అనగా నేమి?

జ. శింజాన అనగా మ్రోగుతున్న అని అర్థం.

186. మణిమంజీర అనగా నేమి?

జ. మణులతో కూడుకున్నటువంటి అందెలు.

187. మండిత అంటే ఏమిటి?

జ. అలంకృతమైన అని అర్థం.

188. లలితా నామానికి అర్థం ఏమిటి?

జ. లోకాతీతం అయిన లావణ్యాన్ని లలితా అంటారు

189. పదాంబుజ అంటే ఏమిటి?

జ. పాదపద్మములు.

190. మహాపాదుక మంత్రంలోని రెండు ప్రధానమైన విద్యలు ఏవి?

జ. 1)కాది విద్య 2) హాది విద్య.

191. అమ్మవారి పాదముల గురించి తెలుగులో వర్ణించిన కవి ఎవరు?

జ. కూచిమంచి తిమ్మకవి.

192. అమ్మవారి అందెలలో ఏమి రవళిస్తున్నాయి?

జ. అమ్మవారి అందెలలో తొలిపలుకులు రవళిస్తున్నాయి.

193. మరాళీ అంటే ఏమిటి?

జ. మరాళీ అంటే ఆడహంస అని అర్థం.



194. పురుషుడికి ఎన్ని రకాల గమనములు చూపించారు?

జ. చతుర్విధ గమనములు చూపించారు.

195. మనలో ఏది హంస గమనం?

జ. మనలో ఉచ్ఛ్వాస, నిశ్వాస రూపంలో ప్రాణ శక్తి యొక్క గమనమే హంస గమనం.

196. శరీరంలో ఏ శక్తి ముఖ్య ప్రాణశక్తిగా గమనం చేస్తుంది?

జ. శరీరంలో చిచ్ఛక్తి ముఖ్య ప్రాణశక్తిగా గమనం చేస్తుంది.

197. చిచ్ఛక్తి ఎన్ని నాడులకు ప్రాణశక్తిని ప్రసరింప చేస్తుంది?

జ. చిచ్ఛక్తి డెబ్బైరెండువేల నాడులకు ప్రాణశక్తిని ప్రసరింప చేస్తుంది.

198. ప్రాణశక్తిని ఇచ్చే నాడి ఏది?

జ. సుషుమ్న నాడి.

199. సుషుమ్న నాడికి ఇరుప్రక్కల ఉండే నాడులు ఏవి?

జ. ఇడా, పింగళ.

200. హంస గమనంలో 'హ', 'స' దేనిని తెలియ చేస్తాయి?

జ. 'హ' కారం శివుడిని, ' స ' కారం శక్తిని తెలియ చేస్తాయి.

201. వ్యక్తి యొక్క ఏ స్థితిని బట్టి ప్రాణ గమనం ఉంటుంది?

జ. వ్యక్తి యొక్క భావనా స్థితిని బట్టి ప్రాణ గమనం ఉంటుంది.

202. భావనా స్థితులు ఎన్ని రకాలు?

జ. భావనా స్థితులు ఎనిమిది రకాలు.

203. ఊపిరి ఎప్పుడు మంద గమనంలో ఉంటుంది?

జ. జప, ఉపాసన, ధ్యాన సమయంలో ఊపిరి మంద గమనంలో ఉంటుంది.

204. యోగిలో కుండలిని గమనం ఎలా సాగుతుంది?

జ. యోగిలో కుండలిని గమనం మూలాధారం నుండి సహస్రారం చేరి మళ్ళీ సహస్రారం నుండి మూలాధారంకు వస్తూ చక్కటి గమనం సాగిస్తుంది.

205. శేవధి: అంటే ఏమిటి?

జ. దాన్ని మించినది మరొకటి లేదన్నప్పుడు శేవధి: అంటారు.

206. సర్వారుణ అంటే ఏమిటి?

జ. సర్వారుణ అంటే అంతటా అరుణ కాంతితో ప్రకాశించునది అని అర్థం.

207. అమ్మవారి పాదముల నుండి వచ్చే కిరణములకు ఎన్ని కళలు ఉన్నాయి? అవి ఏవి?

జ. అమ్మవారి పాదముల నుండి వచ్చే కిరణములకు మూడు కళలు ఉన్నాయి. అవి 1)అగ్ని కళలు -నూట ఎనిమిది 2) సూర్య కళలు -నూట పదహారు 3) చంద్రకళలు - నూట ముప్పయిఆరు.

208. అనవద్యాంగి అంటే ఏమిటి?

జ. అనవద్యాంగి అంటే లోపము/ దోషము లేనిదని అర్థం.

## అమ్మవారి స్థాన, లీలా వర్ణన

209. సుమేరు పర్వతము ఎన్ని రూపాలతో ఉంటుంది?

జ. సమస్త జ్యోతిష్య మండలాలకు ఆధారమై, భూమిపైన కైలాసశిఖర రూపములో, శ్రీచక్ర రూపములో, మానవ శరీరములోని వెన్నుదండం రూపములో ఉన్నది.

210. శ్రీమన్నగరం ఎక్కడ ఉన్నది?

జ. శ్రీమన్నగరం సుమేరు పర్వత మధ్యములో, శ్రీచక్రములోని బిందుస్థానంలో, మానవశరీరములోని సహస్రార స్థానంలో ఉన్నది.

211. లలితాసహస్రనామ అంతర్గత పంచబ్రహ్మలు ఎవరు?

జ. బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర, సదాశివులు .

212. చింతామణులు అనగా ఏమిటి?

జ. చింతామణులు అనగా మంత్రములు, కోర్కెలు తీర్చు మణులు అని అర్థం.

213. మహాపద్మాటవీలోని పద్మములు దేనిని సూచించుచున్నవి?

జ. మహాపద్మాటవీలోని పద్మములు సహస్రార కమలం మరియు మణిద్వీపములోని మెట్ట తామరలను సూచిస్తాయి.

214. సుధాసాగరం అంటే ఏమిటి?

జ. సుధాసాగరం అంటే అనంతమైన శాశ్వతమైన ఆనంద స్థితి.

215. కామాక్షి పేరునకు గల అర్థం ఏమిటి?

జ. ఏ తల్లి చూపులు పడితే  అన్నికోరికలు తీరుతాయో (ఏ కోరికా లేని స్థితి వస్తుందో) ఆ తల్లి కామాక్షి.



216. కామాక్షి అని అమ్మవారిని మొదట పేరు పెట్టి పిలిచింది ఎవరు?

జ. చతుర్ముఖ బ్రహ్మ.

217. అమ్మవారిని స్తోత్రము చేయుటకు తగు అర్హులు ఎవరు?

జ. దేవతలు,ఋషులు.

218. దేవతలు ఋషులు వేటిని సూచిస్తున్నారు?

జ. "దేవతలు" అనగా ఇంద్రియ శక్తులు, క్రియాశక్తి మరియు వర్ణమాలలోని అచ్చులు. "ఋషులు" అనగా బుద్ధి శక్తులు(ఆలోచనలు), జ్ఞానశక్తి మరియు వర్ణమాలలోని హల్లులు.

219. అమ్మవారి అవతారకార్యము గుర్తు చేయటానికి ప్రయత్నించింది ఎవరు?

జ. నారద మహర్షి.

220. అమ్మవారి గజబల అధ్యక్షురాలు ఎవరు?

జ. సంపత్కరీ, లక్ష్మీదేవి.

221. సంపత్కరీ దేవి దేనిని నిగ్రహిస్తుంది?

జ. దుర్మదమును.

222. అమ్మవారి అశ్వబల అధ్యక్షురాలు ఎవరు?

జ. అశ్వారూఢ అమ్మవారు.

223. అశ్వారూఢ అమ్మవారి ఉపాసన దేనిని అందిస్తుంది?

జ. సంకల్పసిద్ధి, మంత్రసిద్ధి.

224. చక్రరాజము అనగా ఏది?

జ. శ్రీచక్రము.

225. గేయచక్రరథమున ఆరూఢ అయినది ఎవరు?

జ. మంత్రిణీ, (రాజ)శ్యామలా దేవి.

226. గేయచక్రమునకు అర్థము ఏమిటి?

జ. నాద చక్రము.

227. కిరిచక్రరథమున ఆరూఢ అయినది ఎవరు?

జ. దండనాథా దేవి, (మహా)వారాహి.

228. వారాహి తల్లి దేనికి అధిదేవత?

జ. పంటకు, అన్నమునకు.

229. వారాహి ఆయుధములు ఏవి?

జ. నాగలి, రోకలి.

230. అమ్మవారి కుడి, ఎడమల ఉన్న దేవతలు ఎవరు?

జ. అమ్మవారి కుడి వైపు శ్యామల, ఎడమ వైపు వారాహి.

231. శ్యామల వారాహి దేనిని సూచిస్తున్నాయి?

జ. అమ్మవారి జ్ఞానశక్తి శ్యామల, క్రియాశక్తి వారాహి.

232. భండాసురుని రాజధాని పట్టణం ఏమిటి?

జ. శూన్యక పట్టణం.

233. భండాసురుని సైన్యాధ్యక్షుడు మరియు సోదరుల నామములు ఏమిటి?

జ. సైన్యాధిపతి కుటిలాక్షుడు. సోదరులు విశుక్రుడు, విషంగుడు.

234. అమ్మవారికి కామదాయినీ అనే పేరు ఎలా వచ్చింది?

జ. కోర్కెలను తీర్చు తల్లి కాబట్టి కామదాయినీ.

## అమ్మవారి లీలా వైభవం

235. జ్వాలామాలిని దేవి ఎవరు?

జ. తిథి నిత్యా దేవతలలో ఒకరు. శుక్ల పక్ష చతుర్దశి తిథికి మరియు బహుళ పక్ష విదియ తిథికి దేవత.

236. జ్వాలామాలిని దేవి చేత అగ్నిప్రాకారాన్ని చేయించిన దేవత ఎవరు?

జ. వారాహి దేవి.

237. తిథి నిత్యా దేవతలు ఎంతమంది?

జ. పదిహేను మంది.

238. తిథి నిత్యా దేవతల పేర్లు ఏమిటి?

జ. కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్న, భేరుండ, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి, శివదూతి, త్వరిత, కులసుందరి, నిత్యా, నీలపతాక, విజయ, సర్వమంగళ, జ్వాలామాలిని, చిత్ర.

239. అమ్మవారి నామాల చివర ఉన్న - హర్షిత, సముత్సుక, నందిత, తోషిత అన్న పదాల భావం ఏమిటి?

జ. మనం ఏది చేసినా అమ్మవారి ప్రీత్యర్థం అని, తత్ సత్ బ్రహ్మార్పణ మస్తు అనే భావనతో ఉండడం.



240. అగ్ని ప్రాకారంలో ఎన్ని ఆవరణలు ఉన్నాయి?

జ. రెండు ఆవరణలు: 1) అంతరావరణ 2) బహిరావరణ.

241. అంతరావరణలో ఉండే దేవతలు ఎవరు?

జ. శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి, ఇరువైపులా శ్రీ శ్యామలా దేవి మరియు శ్రీ వారాహీ దేవి, ముందు వెనుక సంపత్కరీ, అశ్వారూఢా దేవతలు ఉంటారు. అలానే శ్రీసూక్తంలో చెప్పినట్లుగా ముందు  అశ్వములు, మధ్యలో అమ్మవారి రథం, వెనుక ఏనుగులు- *అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాదప్రబోధినీమ్* - అని కూడా వివరించారు.

242. బహిరావరణలో ఉండే దేవతలు ఎవరు?

జ. అమ్మవారి దేవ సైన్యము.

243. అమ్మవారికి ఎన్ని సేనలు ఉన్నాయి?

జ. అరవైనాలుగు కోట్ల సేనలు ఉన్నాయి.

244. ఆధ్యాత్మిక సాధన అంటే ఏమిటి?

జ. మనలో ఉన్న భగవత్ శక్తిని జాగృతం చేసుకోవడం.

245. భండాసుర పుత్రులు ఎవరు?

జ. ముప్పై మంది. అవిద్యా వృత్తులు మరియు అజ్ఞాన మాలిన్యాలు.

246. అమ్మ శ్రీబాలాత్రిపురసుందరి ఎక్కడనుండి ఆవిర్భవించారు?

జ. అమ్మ లలితా దేవి హృదయం నుండి.

247. అమ్మ శ్రీ బాలాత్రిపురసుందరి ఎన్ని సంవత్సరముల వయస్సుగా కనిపిస్తారు?

జ. నిత్యమూ తొమ్మిది సంవత్సరముల బాలగా కనిపిస్తారు.

248. శ్రీ లలితా త్రిపుర సుందరి ఎన్ని సంవత్సరముల వయస్సుగా కనిపిస్తారు?

జ. నిత్యమూ పదహారు సంవత్సరముల తరుణిగా గోచరిస్తారు.

249. అమ్మ శ్రీ బాలాత్రిపురసుందరి ఎవరు?

జ. శ్రీ విద్యాధిదేవత, నవాక్షరి విద్య, షడాక్షరి విద్య, పూర్ణ విద్య, బీజ విద్య, మరియు ప్రాణశక్తి స్వరూపిణి.

250. అమ్మ బాలా త్రిపురసుందరి దేవి యొక్క రథము పేరు ఏమిటి?

జ. కర్ణీ రథము. ఇది వెయ్యి హంసలతో ఉంటుంది.

251. వెయ్యి హంసల యొక్క అర్థము ఏమిటి?

జ. హంసలు అంటే ఊపిరులు. అమ్మ మంత్రము శ్వాసతో చెయ్యడము ఉత్కృష్టం.

252. జ్ఞాన స్వరూపిణి అయిన బాలా అమ్మవారు రాక్షసులపై సంధించిన అస్త్రము పేరు, విశేషము ఏమిటి?

జ. నారాయణాస్త్రము. అర్థచంద్ర ఆకారం ఉన్న ఈ బాణంతో భండపుత్రులను సంహరించింది బాలా అమ్మవారు.

253. లలితా సహస్ర నామాలను ఎన్ని రకాలుగా ఉపాసన చెయ్యాలి?

జ. ఒకవైపు శ్రీ చక్ర ఉపాసనగా, ఇంకొకవైపు కుండలిని ఉపాసనగా, మరొకవైపు వేదాంత తత్త్వ ఉపాసనగా (విచారణ) చూడాలి.

254. విశుక్ర మరియు విషంగ నామ అర్థములు ఏమిటి?

జ. అహంకార, మమకారాలు. విషంగము అంటే - దుస్సాంగత్యము మరియు నాది అనే అజ్ఞానము. విశుక్రుడు అంటే  - శుక్రము అంటే “తేజస్సు”, "వి” అంటే తీసేస్తాడు.

255. రాజశ్యామలా దేవి ఎవరు?

జ. శ్రీ లలితా దేవికి మంత్రిణీదేవత.

256. మనలో ఉన్న అజ్ఞానము పోవాలంటే ఎవరిని ఆరాధించాలి?

జ. శ్రీ రాజశ్యామలా దేవిని.

257. రాక్షసుడు అయిన విశుక్రుడిని వధించిన దేవత ఎవరు?
జ. శ్రీ శ్యామలా దేవి.
258. రాక్షసుడు అయిన విషంగుడిని వధించిన దేవత ఎవరు?
జ. వారాహి దేవి.

## భండాసుర వధ

259. భండాసురుడు ఎవరు?
జ. భండాసురుడు చీదరించదగిన దుర్గుణములు అన్నీ కలిగినవాడు.
260. శస్త్రము అని దేనిని అంటారు?
జ. భౌతికమైన శక్తితో ప్రయోగించేది.
261. అస్త్రము అని దేనిని అంటారు?
జ. మంత్ర శక్తితో ప్రయోగించేది.
262. విషంగుడు ఏ యంత్రాన్ని ప్రయోగించాడు?
జ. జయవిఘ్న శిలాయంత్రము.
263. శక్తి సేనలు ఎందుచేత నిరుత్సాహపడ్డాయి?
జ. విఘ్నయంత్రము చేత.
264. లలితా దేవి అంటే ఎవరు?
జ. స్పందన శక్తి.



265. లలితాదేవి మరియు కామేశ్వరుని పరస్పర నవ్వుల కలయికలో నుండి ఎవరు ఆవిర్భవించారు?
జ. మహావల్లభగణపతి.
266. గణపతిలో గజముఖము ఏ స్వరూపం?
జ. ఓంకార స్వరూపం.
267. వల్లభ గణపతిలో ఉన్న మిథునదేవతలు ఎవరు?
జ. మహా వల్లభ గణపతిలో ఉన్న మిథునదేవతలు పది మంది. వారు లక్ష్మీనారాయణులు, ఉమామహేశ్వరులు, రతీమన్మథులు, భూదేవీ వరాహస్వామి మరియు పుష్టి పుష్టిపతి.
268. మహాగణపతి తొండముతో దేనిని పట్టుకున్నాడు?

జ. రత్నకలశాన్ని.

269. అద్వైతానికి సరిగ్గా సరిపోయే విద్య అని శంకరులు ఏ విద్యను అన్నారు?

జ. శ్రీవిద్య.

270. గణపతి ఏ యంత్రాన్ని భేదించాడు?

జ. గణపతి విఘ్నయంత్రాన్ని భేదించాడు.

271. గణపతి రోమకూపముల నుండి ఎంతమంది గణపతులు వచ్చారు?

జ. గణపతి రోమకూపముల నుండి ఏడుకోట్ల హేరంబ గణపతులు వచ్చారు.

272. వేదమంత్రములు మొత్తము ఎన్ని?

జ. ఏడుకోట్లు.

273. ప్రహర్షితా అనగా అర్థం ఏమిటి?

జ. ప్రహృష్టముగా (మిక్కిలి) ఆనందించుట.

274. అమ్మవారు ప్రయోగించిన రెండు సూర్య అస్త్రములు ఏవి?

జ. మహాతరుణి, చక్షుష్మతి.

275. సూర్య ఉపాసన వల్ల ఏ శక్తి పెరుగుతుంది?

జ. దృష్టి శక్తి.

276. అమ్మవారు ప్రయోగించిన నామత్రయ అస్త్రములు ఏమిటి?

జ. అచ్యుత, అనంత, గోవింద.

277. పాషండ శస్త్రానికి ప్రతిగా అమ్మవారు ఏ అస్త్రాన్ని ప్రయోగించారు?

జ. గాయత్రీ అస్త్రము.

278. అమ్మవారు వేసిన ఏ అస్త్రములో చండీ నవావరణములు ఉన్నాయి?

జ. దుర్గా అస్త్రములో.

279. సోమకాసురాది పదిమంది రాక్షసులను సంహరించడానికి అమ్మవారు ఎవరిని ప్రయోగించారు?

జ. నారాయణుడి దశావతారములను.

280. దశావతారముల దేవతలు వారి వారి ముద్రలతో ఆరాధిస్తే ఏమి చేస్తారు?

జ. ఆరాధించిన వ్యక్తిలోని అసురశక్తులను నిర్మూలిస్తారు.

281. బ్రహ్మ నుండి వేదములు అపహరించినది ఎవరు?

జ. సోమకాసురుడు.

282. పాశుపత మంత్రము నిక్షిప్తము అయ్యున్న అమ్మవారి నామం ఏమిటి?

జ. మహాపాశుపతాస్త్రాగ్ని నిర్దగ్ధాసురసైనికా.

283. భండాసురుని శూన్యక పట్టణాన్ని అమ్మవారు ఏ అస్త్రముతో సంహరించారు?

జ. కామేశ్వరాస్త్రం.

## కుండలిని శక్తి

284. అమ్మవారి సూక్ష్మ రూపము అంటే ఏమిటి?

జ. అమ్మవారి సూక్ష్మ రూపము అనగా అమ్మవారి మంత్రము.

285. అమ్మవారి ప్రధాన మంత్రము ఏమిటి? ఎన్ని అక్షరాలు కలది?

జ. అమ్మవారి ప్రధాన మంత్రము పంచదశి మంత్రము, పదిహేను అక్షరాలు కలది.

286. అమ్మవారి స్థూలరూపములోని మూడు కూటములు ఏమిటి?

జ. వాగ్భవ కూటము, కామరాజ కూటము, శక్తి కూటము.

287. వాగ్భవ కూటాన్ని ధ్యానిస్తే ఏమి సిద్ధిస్తుంది?

జ. ధర్మంగా జీవించడానికి కావలసిన తెలివితేటలు, శాస్త్ర జ్ఞానము సిద్ధిస్తాయి.

288. మధ్య కూటము లేక కామరాజ కూటము ధ్యానిస్తే ఏమి సిద్ధిస్తుంది?

జ. మధ్య కూటము లేక కామరాజ కూటము ధ్యానిస్తే అర్ధము, కామము సిద్ధిస్తుంది.

289. శక్తి కూటము ధ్యానిస్తే ఏమి సిద్ధిస్తుంది?

జ. శక్తి కూటము ధ్యానిస్తే మోక్షము సిద్ధిస్తుంది.

290. అమ్మవారి సూక్ష్మ రూపమైన పంచదశిలో ఎన్ని కూటములు ఉన్నాయి?

జ. అమ్మవారి సూక్ష్మ రూపము కూడా స్థూల రూపము వలే మూడు కూటములతో ఉన్నది.

291. కుండలిని అంటే ఏమిటి?

జ. కుండలి అంటే అమ్మ రూపము. అమ్మ మనలో (కుండలిని ) ఈశ్వర చిచ్ఛక్తిగా ప్రసరిస్తుంది.

292. కుండలిని జీవునిలో ఎప్పుడు ప్రవేశిస్తుంది?

జ. శిశువు గర్భంలో ఏడవ నెలలో ఉన్నప్పుడు, బ్రహ్మ రంధ్రం నుండి కుండలినీ శక్తి శిశువులో ప్రవేశిస్తుంది.

293. కుండలిని శక్తి మనలో ప్రధానంగా ఎక్కడ ఉంటుంది?

జ. మూడున్నర చుట్లు చుట్టుకున్న పాము వలే మూలాధారంలో ఉంటుంది.

294. కుండలిని శక్తి సాధకులు కాని వారికి ఎలా ప్రసరిస్తుంది?



జ. కుండలిని శక్తి సాధకులు కాని వారికి క్రిందికి ప్రసరిస్తుంది.

295. యోగులలో కుండలిని శక్తి ఎలా ప్రసరిస్తుంది?

జ. యోగికి కుండలిని శక్తి షట్చక్రాలని దాటుకుంటూ పైకి ప్రసరిస్తుంది.

296. బ్రహ్మజ్ఞానికి కుండలిని ఎక్కడికి చేరుతుంది?

జ. బ్రహ్మజ్ఞానికి కుండలిని శక్తి షట్చక్రాలని దాటుకుంటూ సహస్రారానికి చేరుకుంటుంది. అప్పుడు కలిగే ఆనందము బ్రహ్మానందం.

297. బ్రహ్మజ్ఞాని అనుభూతి ఎలా ఉంటుంది?

జ. బ్రహ్మజ్ఞాని అనుభూతి అలౌకికముగా ఉంటుంది. సహస్రారము చేరిన కుండలిని శక్తి యోగికి డెబ్బైరెండువేల నాడులని సోమముతో తడుపుతున్న అనుభూతి కలుగుతుంది.

298. కుండలిని సాధన ఎలా చేయాలి?

జ. నిద్ర లేవగానే అమ్మవారిని, గురువుని తలచుకుని, కుండలిని మనలో ఒక్కొక్క చక్రం దాటుకుంటూ పైకి వెళ్తున్నట్టు భావించాలి.

299. కులము అంటే ఏమిటి? మూడు అర్థాలు చెప్పండి?

జ. కులము అంటే సమూహము, కులము అంటే మనలో ఉండే ఆరు యోగ చక్రములు (మూలాధారం నుండి ఆజ్ఞా చక్రం). కులము అంటే మన పూర్వీకులు. కులము అంటే మన గురుపరంపర లేక గురుకులం.

300. ఈ మధ్య కాలములో భారత దేశములో నడయాడిన బ్రహ్మజ్ఞానుల పేర్లు చెప్పండి?

జ. శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి (కంచి పరమాచార్య) మరియు శ్రీ శ్రీ శ్రీ రమణ మహర్షి.

301. కుండలిని శక్తిని వశిన్యాది వాగ్దేవతలు అమ్మవారిగా ఎలా పోల్చారు?

జ. కుండలిని శక్తిని  కులాంగన (కుల స్త్రీ) అయిన అమ్మవారిగా పోల్చారు.

302. అమ్మవారి విద్య ఏమిటి? అది ఎవరికి తెలుస్తుంది?

జ. అమ్మవారి విద్య, శ్రీ విద్య. అతి గుహ్యమైన విద్య, యోగ్యులకి మాత్రమే సంప్రదాయంగా వస్తుంది.


303. సహస్రారములో కుండలిని శక్తి ఎవరి వద్దకు చేరుతుంది?

జ. సహస్రారములో ఉన్న తన పతియైన పరమ శివుని వద్దకు చేరుతుంది.

## శ్రీ గురువుగారి ఆశీస్సులతో

## Contributors of Sri Lalitha Sahasranama Bhasyam Feb 2020

| | | |
|---|---|---|
| 1 | Rajeswari Medicherla | California |
| 2 | Divakar Jammalamadaka | Atlanta |
| 3 | Ratnakar | New Jersey |
| 4 | Srilatha Amancharla | Bharath |
| 5 | MadhukarReddy Dudipala | Nebraska |
| 6 | Sarada Mani | Bharath |
| 7 | Nagaraju Koppole | Atlanta |
| 8 | Pavan Kumar | Virginia |
| 9 | Uma Kameti | California |
| 10 | Kalpana Maddula | California |
| 11 | Venkatesh Ghantasala | North Carolina |
| 12 | Rajeswari Pusuluri | North Carolina |
| 13 | Padma Achanta | North Carolina |
| 14 | Aparna Vallury | North Carolina |



సర్వం శ్రీలలితా చరణారవిందార్పణమస్తు